

స్థిరంగా చీనీ ధరలు
చీనీ ధరలు వారం రోజులుగా స్థిరంగా కొనసాగుతున్నాయి. అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను కాయలు రూ.32 వేలు పలికాయి.



క్రికెట్‌లో అదుర్స్
ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు క్రికెట్‌లో రాణిస్తున్నారు. ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం
35.7°/23.1°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సమష్టి కృషితోనే ఎన్నికలు విజయవంతం
- సిబ్బందిని అభినందించిన ఎస్పీ



సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని, సమష్టి కృషితోనే జిల్లాలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించగలిగామని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో డీపీఓ, ఏఆర్, బీడీ టీం, స్పెషల్ బ్రాంచ్, స్పెషల్ పార్టీ, ఎస్‌జీఓ, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ మాధవరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ సమష్టిగా క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేశారన్నారు. అందువల్లే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, సీసీ రాఘవేంద్ర, స్పెషల్ బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, డీసీఆర్‌బీ సీఐ శ్రీహర్ష, ఆర్‌ఐలు రవికుమార్, వలి, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ ప్రదీప్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

అపరిమితంగా ఇంజినీరింగ్ సీట్లు



అనంతపురం: ఇంజినీరింగ్ కోర్సుల్లో అపరిమితంగా సీట్లు భర్తీ చేసుకునేలా ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సెల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 విద్యా సంవత్సరం నుంచి సీట్ల పరిమితిని ఎత్తివేసింది. కళాశాల యాజమాన్యాలు అదనపు బ్రాంచీలకు అనుమతులు తీసుకుంటున్నాయి. మౌలిక సదుపాయాలు, అధ్యాపకుల ఆధారంగా అదనపు కోర్సుల ఏర్పాటుకు అనుమతులు ఇస్తుండడంతో చాలా కళాశాలలు దరఖాస్తు చేశాయి. కొన్ని కళాశాలలకు ఇప్పటికే అనుమతి లభించింది.

నూతన విద్యా విధానానికి అనుగుణంగా..

ఇప్పటి వరకు ఉన్న విద్యా విధానం ప్రకారం ఒక్కో బ్రాంచ్‌లో గరిష్టంగా 240 సీట్లకే పరిమితి ఉంది. అయితే, నూతన జాతీయ విద్యా విధానం–2020కు అనుగుణంగా ఈ పరిమితిని ఏఐసీటీఈ తొలగించింది. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (స్థూల ప్రవేశాల నిష్పత్తి), డిమాండ్ మేరకు సీట్లు పెంచుకోవచ్చు. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో ఇప్పటికే 89 ఇంజినీరింగ్ కళాశాలలు దరఖాస్తు చేయగా, 75 కళాశాలలకు ఏఐసీటీఈ గుర్తింపు లభించింది. తక్కిన 14 ఇంజినీరింగ్ కళాశాలలకు ఏఐసీటీఈ గుర్తింపు రావాల్సి ఉంది. మౌలిక సదుపాయాల పరిశీలనకు ఏఐసీటీఈ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాలను అమలు చేస్తోంది. కంప్యూటర్ సైన్సెస్ (సీఎస్‌ఈ) బ్రాంచ్‌కు డిమాండ్ అధికంగా ఉండడంతో కళాశాలలన్నీ దాదాపుగా ఇందులోనే అదనపు సెక్షన్లకు దరఖాస్తు చేశాయి. కొన్ని సీఎస్‌ఈతో పాటు ఈసీఈకి అనుమతి తీసుకుంటున్నాయి.

పెరగనున్న కన్వీనర్ కోటా..

ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో ఇప్పటికే సీట్లు అధికంగా ఉన్నాయి. అయితే, ఒక్కో కళాశాలలో 1,000 సీట్లు ఉంటే, ఇందులో 650 కంప్యూటర్ సైన్సెస్, వాటి అనుబంధ కోర్సుల్లోనే ఉన్నాయి. కంప్యూటర్ సైన్సెస్‌కు విపరీతమైన డిమాండ్ పెరగడమే ఇందుకు కారణం. తల్లిదండ్రులు బలవంతంగా కంప్యూటర్ సైన్సెస్ కోర్సులో చేరేలా విద్యార్థులను ప్రేరేపిస్తుండడంతో అయిష్టంగానే తీసుకుంటున్నారు. మరికొన్ని కళాశాలలు కంప్యూటర్ సైన్సెస్ అదనపు సెక్షన్లుకు అనుమతి తీసుకుంటున్నాయి. ఈ దఫా ఏఐసీటీఈ అదనపు సెక్షన్లు ఇవ్వనుండడంతో కన్వీనర్ కోటా కింద సీట్లు మరింత పెరగనున్నాయి.

అధునాతన కోర్సుల్లోనూ..

ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లో అధునాతన కోర్సుల్లోనూ సీట్లు పెంచుకుంటున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ లాంటి వాటిల్లోనూ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఎమర్జింగ్ కోర్సుల్లో ఉద్యోగావకాశాలు పెరుగుతాయనే అంచనాలు ఉండటం, విద్యార్థుల నుంచి డిమాండ్ వస్తుందనే ఉద్దేశంతో కొన్ని కళాశాలలు సీఎస్‌ఈలో వీటిని తీసుకొచ్చాయి. మరికొన్ని కళాశాలలు సీఎస్‌ఈతో సంబంధం లేకుండా నేరుగా బ్రాంచ్‌లు నిర్వహించేందుకు ముందుకువచ్చాయి.

జబ్బుల జీవనం!



- ఉమ్మడి అనంతలో భారీగా పెరిగిన జీవన శైలి వ్యాధుల బాధితులు
- వ్యాయామం చేయకపోవడంతోనే సమస్యలు
- 18 ఏళ్లు దాటగానే శారీరక శ్రమ ఉండాల్సిందేనంటోన్న వైద్యులు

❐ గుంతకల్లుకు చెందిన పద్మలతకు 33 ఏళ్లు. ఇద్దరు పిల్లలున్నారు. వారం క్రితం అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. చికిత్సచేసేలోపే మృతి చెందింది. గుండెపోటుతో ఆమె చనిపోయినట్లు వైద్యులు తేల్చారు.

❐ అనంతపురం సమీపంలోని రుద్రంపేటకు చెందిన ఓ ప్రైవేటు టీచర్ నెల రోజుల క్రితం గుండెపోటుతో కుప్పకూలిపోయారు. ఆయన వయసు 44 ఏళ్లు. ఇంటర్, టెన్త్ క్లాస్ చదివే పిల్లలున్నారు. పని ఒత్తిడి కారణంగా ఈయన గుండెపోటుకు గురై మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

గడిచిన నాలుగేళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరోగ్యశ్రీలో జరిగిన గుండె జబ్బుల చికిత్సల వివరాలు

కార్డియో.. కార్డియో థొరాసిక్ సర్జరీలు	10,621
దీనికోసం చేసిన వ్యయం	రూ.65.75 కోట్లు
స్టెంట్‌లు, యాంజియో గ్రామ్‌లు	18,276
ప్రభుత్వం చేసిన వ్యయం	రూ.63.58 కోట్లు
ప్రైవేటు.. ఇన్సూరెన్స్‌లో జరిగినవి	22,500
బాధితులకు అయిన ఖర్చు	రూ.130.50 కోట్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పూర్తిగా వ్యవసాయాధారిత జిల్లా అయిన ఉమ్మడి అనంతపురంలో కూడా కొన్నేళ్లుగా జీవనశైలి జబ్బులు పెరుగుతున్నట్లు తేలింది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ వ్యాధులు ఇప్పుడు పల్లెలనూ కలవరపాటుకు గురిచేస్తున్నాయి. దీంతో ఆర్థికంగా వేలాది కుటుంబాలు చితికిపోతున్నాయి. వ్యాయామం చేయకపోవడంతో చేజేతులారా వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వారానికి కనీసం 150 నిమిషాలు

జీవనశైలి వ్యాధులు దరిచేరకూడదనుకుంటే వ్యాయామం మినహా మరో దారి లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) చెబుతోంది. డబ్ల్యూహెచ్ఓ నిబంధనల ప్రకారం 18 ఏళ్ల వయసు దాటిన వారు విధిగా వ్యాయామం చేయాలి. వారానికి కనీసం 150 నిమిషాలు వ్యాయామం చేయాల్సి ఉంటుంది. యోగా, సైక్లింగ్ తదితర వాటి వల్ల ఆక్సిజన్ ఎక్కువగా శరీరంలోకి చేరుతుంది. దీంతో అధిక రక్తపోటు, బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం, మధుమేహం, క్యాన్సర్, వంటి వ్యాధులు దగ్గరికి రావు . అయితే, అవగాహన లేక కొందరు, బద్ధకంతో మరికొందరు పట్టించుకోకపోవడంతోనే జీవనశైలి జబ్బుల బారిన పడుతున్న వారు రోజు రోజుకూ పెరుగుతున్నట్టు డబ్ల్యూహెచ్ఓ వెల్లడించింది. రోజూ వ్యాయామం తప్పనిసరిగా అలవర్చుకోవాలని సూచిస్తోంది.

ప్రమాదం ఎవరికి, ఎంతంటే..?

రోజూ వ్యాయామం చేసేవారికంటే చేయని వారిలో ప్రమాద అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. 21 శాతం నుంచి 25 శాతం మందిలో రొమ్ము క్యాన్సర్, కొలనో క్యాన్సర్లు వచ్చే అవకాశం ఎక్కువ. అలాగే మధుమేహం వచ్చే అవకాశం 27 శాతం మందిలో అధికంగా ఉంటుంది. గుండె జబ్బుల ప్రమాదం 30 శాతం మందిలో ఎక్కువగా ఉన్నట్టు తేలింది. శారీరక వ్యాయామం ద్వారా బరువు నియంత్రణలో ఉండటంతో పాటు జీవనశైలి జబ్బుల నుంచి బయట పడే అవకాశం ఉంటుంది. దీంతో పాటు సమతులాహారం తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో భిన్నమైన పరిస్థితులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యాయామంపై అవగాహన లేకపోవడం, రకరకాల ఆహారపు అలవాట్ల కారణంగా జీవనశైలి జబ్బులకు గురవుతున్న వారి సంఖ్య తీవ్రంగా ఉన్నట్టు కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ నివేదికలో వెల్లడైంది. సగటున 45 శాతం మంది వయసుకు తగ్గ బరువు కంటే ఎక్కువగా ఉన్నట్టు తేలింది. 2004తో పోలిస్తే ఉమ్మడి జిల్లాలో నేడు జీవనశైలి బాధితుల సంఖ్య 43 శాతం పెరిగినట్టు వెల్లడైంది. ఎక్కువ మంది స్థూలకాయ సమస్యతో బాధపడుతున్నారు. ఇక డయాబెటిక్, రక్తపోటు సమస్యలతో బాధపడుతున్న వారు 20 శాతం మందికంటే ఎక్కువగా ఉన్నారు.

శారీరక వ్యాయామం తప్పనిసరి



గుండెపోటుకు గురవుతున్న వారి సంఖ్య ఇటీవల పెరిగిపోయింది. ఇందుకు ప్రధాన కారణం పొగ తాగడం, మద్యం సేవించడం. ఎలాంటి వ్యాయామం లేకుండా ఉండటం అనేది పొగ తాగడంతో సమానమే. వీళ్లలో ఊపిరితిత్తుల పనితీరు సరిగా ఉండదు. 20 ఏళ్లు దాటగానే శారీరక వ్యాయామం తప్పనిసరి. ధూమపానానికి దూరంగా ఉంటే గుండె జబ్బులు నియంత్రించవచ్చు.

– డాక్టర్ వంశీకృష్ణ, హృద్రోగ నిపుణులు, అనంతపురం

కార్మికుల స్థలం కబ్జాకు టీడీపీ నేతల యత్నం
- జేసీబీలతో రెండు రోజులుగా భూమి చదును పనులు
- అడ్డుకున్న సీపీఎం నాయకులు
- స్థలం చేనేత కార్మిక సంఘానిదని వెల్లడి
- ఆక్రమణపై పోలీసులకు, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు



సీపీఎం నాయకులపై టీడీపీ నేతల దౌర్జన్యం

సోమందేపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ నాయకులు ప్రభుత్వ స్థలాలపై కన్నేశారు. గతంలో ఇతరులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలనూ స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఏపీ చేనేత కార్మిక సంఘానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని దక్కించుకునేందుకు టీడీపీ నాయకుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి అమరేంద్ర పావులు కదిపాడు. జేసీబీల సాయంతో రెండు రోజులుగా ఆ స్థలాన్ని చదును చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న, చేనేత కార్మిక సంఘం నేతలతో కలిసి శనివారం పనులను అడ్డుకున్నారు. దీంతో అమరేంద్రకు మద్దతుగా టీడీపీ మండల కన్వీనర్ సిద్దలింగప్ప, పట్టణ కన్వీనర్ సూరి అక్కడికి చేరుకుని సీపీఎం నాయకులతో వాగ్వాదానికి దిగారు. స్థలం తమదేనని, ఎవరైనా అడ్డువస్తే తలలు తీస్తామంటూ బెదిరించారు. అయినప్పటికీ వెనక్కి తగ్గని సీపీఎం నేతలు పార్టీ జెండా పాతగా, టీడీపీ నాయకుడు అమరేంద్ర అనుచరులు జెండాను తొలగించే ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అనంతరం సీపీఎం నాయకులు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థలంలో ఎలాంటి కట్టడాలకు అనుమతులు ఇవ్వవద్దని పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు.

2016 నుంచీ పొజిషన్‌లో ఉన్నాం..

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ కార్యాలయం ఎదుట సర్వే నంబర్ 25లోని స్థలాన్ని ప్రభుత్వం 2016లోనే చేనేత కార్మిక సంఘం భవన్ నిర్మాణానికి కేటాయించిందని తెలిపారు. అప్పటి నుంచీ కార్మిక సంఘమే పొజిషన్‌లో ఉందని తెలిపారు. అనంతరం పట్టా మంజూరు కోసం ప్రభుత్వాన్ని కోరామని, సరైన స్పందన లేకపోతే పెనుకొండ కోర్టును ఆశ్రయించామన్నారు. అయితే అధికార బలంతో టీడీపీ నాయకులు స్థలం ఆక్రమణకు ప్రయత్నం చేస్తున్నారని, ఇలాగే వ్యవహరిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, లక్ష్మీ నారాయణ, రంగప్ప, హనుమయ్య, వెంకటేష్, మాబూ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న ప్రకాశం జిల్లా సత్యసాయి భక్తులు

అలరించిన 'గాన ప్రకాశం'
ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ప్రకాశం జిల్లా సత్యసాయి భక్తులు సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత 'గాన ప్రకాశం' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి భక్తి గీతాలు ఆలపించారు. సుమారు గంటపాటు సాగిన సంగీత కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మర్మోగింది. అనంతరం వారంతా సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.



గీతాలు ఆలపిస్తున్న మహిళా భక్తులు

రాయితీ ప్రయాణానికి రాచబాట



గత సంవత్సరం ఆర్టీసీ మంజూరు చేసిన పాసుల వివరాలు

డిపో	ఉచిత పాసులు	రాయితీ పాసులు	పీహెచ్‌సీ పాసులు
ధర్మవరం	1,664	3,621	717
హిందూపురం	1,604	4,738	439
కదిరి	2,277	4,280	1,438
మడకశిర	681	1,848	12
పెనుకొండ	448	1,507	33
పుట్టపర్తి	980	1,614	217

బస్సు పాసుల జారీకి ఆర్టీసీ సిద్ధం
- 12 ఏళ్ల లోపు బాలురు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచిత ప్రయాణం
- వృద్ధులు, దివ్యాంగులకూ రాయితీ పాసులు
- గత ఏడాది జిల్లాలో 28,118 బస్సు పాసుల మంజూరు
- పాతవాటిని రెన్యూవల్ చేస్తున్న ఆర్టీసీ అధికారులు
- ప్రభుత్వ నిర్ణయం మేరకు కొత్త పాసుల మంజూరు వేగవంతం

పుట్టపర్తి టౌన్: విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులకు ఆర్టీసీ తనవంతు తోడ్పాటు అందిస్తోంది. రాయితీ ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ ఎంతో మేలు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా పాసులు జారీ చేస్తోంది. ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా బస్సు పాసులు రెన్యూవల్ చేస్తోంది.

విద్యార్థుల పాసులు రెన్యూవల్..

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ వందలాది మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల ద్వారా ఇంటికి విద్యాలయాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ బస్సుల్లో ప్రయాణించే విద్యార్థిని, విద్యార్థులకు ప్రజా రవాణా శాఖ ఉచిత, రాయితీ బస్సు పాసులు మంజూరు చేస్తోంది. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలలు కళాశాలలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో విదార్థులు ఇబ్బందుల పడకూదనే ఉద్దేశంతో జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీఓ) మధుసూదన్‌ఆదేశాల మేరకు జూన్ 15వ తేదీ నుంచి జిల్లాలోని కదిరి, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ, ధర్మవరం , మడకశిర బస్ డిపోల అధికారులు పాసుల రెన్యూవల్స్ కొనసాగిస్తున్నారు.

ఉచిత పాసులు..

పాఠశాలకు 20 కిలోమీటర్లలోపు నివాసం ఉంటున్న 12 ఏళ్ల లోపు వయస్సు కలిగిన విద్యార్థులకు, 18 ఏళ్లలోపు విద్యార్థినులకు ఆర్టీసీ ఉచిత బస్ పాసులు మంజూరు చేస్తోంది. ఈ పాసులు ఏటా జూన్‌ నుంచి సెప్టెంబర్ వరకూ మంజూరు చేస్తారు. ఈ పాసును విద్యా సంవత్సరం ముగిసేంత వరకూ వినియోగించుకోవచ్చు. పాసు కావాల్సిన విద్యార్థి దరఖాస్తు పూర్తి చేసి ఫొటో అతికించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి చేత సంతకం చేయించాలి. దీనికి ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ జతచేసి ఆర్టీసీ కౌంటర్‌లో అందజేసి ఉచిత బస్ పాస్ పొందవచ్చు.

రాయితీ పాసులు ఎవరికంటే...

నివాస ప్రాంతం నుంచి 50 కిలోమీటర్లలోపు ఉన్న పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు రాయితీపై ఆర్టీసీ బస్ పాసులు మంజూరు చేస్తోంది. నెల, మూడు నెలలు, సంవత్సర కాల పరిమితితో వీటిని జారీ చేస్తారు. తొలుత ఏ కాల పరిమితితో పాసు తీసుకున్నారో ఆదే కాలపరిమితితో రెన్యూవల్ చేస్తారు. మార్పునకు అవకాశం ఉండదు. రెన్యూవల్‌కు సర్వీస్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ పాసు కోసం దరఖాస్తు పూర్తి చేసి విద్యార్థి ఫొటో అతికించి సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో సంతకం చేయించాలి. దీనికి ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ జిరాక్స్ జత చేసి బస్‌పాస్ కౌంటర్‌లో అందజేస్తే పాసు మంజూరు అవుతుంది.

దివ్యాంగులకు సగం రాయితీ..

దివ్యాంగులకు 50 శాతం రాయితీతో బస్సు పాసులు మంజూరు చేస్తున్నారు. ఇందుకు సదరం సర్టిఫికెట్, రేషన్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, దివ్యాంగుడి ఫొటోతో పాటు దరఖాస్తు సమర్పించాలి. అధికారులు అన్నీ పరిశీలించాక అర్హులకు పాసు మంజూరు చేస్తారు. ఐడెంటిటీ కార్డు కోసం రూ.100 ఫీజు తీసుకుంటారు. 100 శాతం అంధత్వం, మానసిక దివ్యాంగులకు వారితో పాటు సహాయకునికి కూడా రాయితీ ఇస్తారు. ఈ పాసులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్ సర్వీసుల్లో చెల్లుబాటు అవుతాయి. ఈ పాసును మూడేళ్ల పాటు వినియోగించుకోవచ్చు.

రెన్యూవల్స్ కొనసాగిస్తున్నాం



పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని అన్ని డిపోల్లో నూతన బస్సు పాసుల మంజూరు, పాత పాసుల రెన్యూవల్స్ కొనసాగిస్తున్నాం. గత ఏడాది జిల్లాలో 7,654 మందికి ఉచిత పాసులు, 17,608 మందికి రాయితీ పాసులు, 2,856 మంది దివ్యాంగులకు బస్సు పాసులిచ్చాం. ఈ ఏడాది వాటిని రెన్యూవల్ చేయడంతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నూతన పాసులు మంజూరు చేస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాల సమయానికి బస్సులు నడుపుతున్నాం.

– మధుసూదన్, జిల్లా ప్రజారవాణాధికారి

పెండింగ్ పనులన్నీ వెంటనే పూర్తి చేయాలి
- విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దు
- అధికారులతో జేసీ అభిషేక్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: కొన్ని నెలలుగా జిల్లా యంత్రాంగం అంతా ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున వివిధ శాఖల్లో పనులు పెండింగ్‌లో పడిపోయాయని, వాటన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి ముఖ్య విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగియడానికి ఉద్యోగులంతా సహకరించారని, అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లోనూ సేవలందించాలన్నారు. అధికారులు, సిబ్బంది ప్రజలతో మమేకమై అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కలెక్టరేట్‌లోని పరిపాలన విభాగం, శాంత భద్రతలు, భూ సేకరణ, రీ సర్వే, ఎన్నికల విభాగం ఆర్‌ఓఆర్ తదితర విభాగాల ఉద్యోగులు పెండింగ్ పనులన్నీ సత్వరం పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం స్పందన ఫిర్యాదుల పరిష్కారం, విపత్తు, కేఆర్‌సీసీ, భూ సేకరణ, పెండింగ్ బిల్లులు, ప్రముఖుల పర్యటనలు, రాష్ట్రస్థాయి కార్యక్రమాలు, పన్నుల వసూళ్లు, తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాల విభజన నేపథ్యంలో అనంతపురం జిల్లా నుంచి జిల్లాకు కేటాయించిన సూపరింటెండెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బందిని వెంటనే రప్పించాలన్నారు. ఎక్కడైనా సిబ్బంది కొరత ఉంటే వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఓ రామాంజనేయ రెడ్డి, సూపరింటెండెంట్ వసుంధర, ఎన్నికల అధికారి మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల 6వ సెమిస్టర్ ఫలితాలను శనివారం ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పరీక్ష ఫలితాల్లో ఆర్ట్స్ విభాగంలో 94 శాతం, కామర్స్‌లో 99 శాతం, సైన్స్‌లో 98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. అలాగే రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను కూడా విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్కే యూనివర్సిటీ ఎగ్జామ్స్ డీన్ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ లోకేష్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ చలపతి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



కీర్తన (ఫైల్)

గోరంట్ల: మండల కేంద్రం గోరంట్లలోని ఒకటో వార్డు ఆంజనేయస్వామి కాలనీలో నివాసముంటున్న కీర్తన అనే తొమ్మిదేళ్ల బాలిక అదృశ్యమైంది. ఈ నెల 19న ఆడుకోవడానికి ఇంటి నుంచి వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. రెండు రోజుల నుంచి వెదికినా జాడ కనిపించలేదు. దీంతో బాలిక అవ్వ శకుంతల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేషనల్ రెఫరీగా రామాంజినేయులు




రామాంజినేయులు

అనంతపురం: ఆలిండియా తైక్వాండో పోలీస్ జూడో క్లస్టర్-2024 పోటీలు ఈ నెల 25 నుంచి 27 వరకు అసోం రాష్ట్రం గౌహతిలో జరగనున్నాయి. ఈ పోటీలకు నేషనల్ రెఫరీగా మల్లెల రామాంజినేయులు ఎంపికయ్యారు. ఈయన అనంతపురం హౌసింగ్ బోర్డులోని రాజీవ్ చిల్డ్రన్ పార్కులో చాంపియన్ తైక్వాండో అకాడమీ నిర్వహిస్తున్నారు.

క్రికెట్‌లో అదుర్స్

- ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ప్రతిభ
- రంజీ, దేశవాళీ పోటీల్లోనూ రాణింపు
- ఆర్డీటీ అండతో అంతర్జాతీయస్థాయికి..



అనంతపురం: క్రేజీ గేమ్ అయిన క్రికెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా క్రీడాకారులు అదరగొడుతున్నారు. రంజీ, దేశవాళీ పోటీల్లోనూ రాణిస్తున్నారు. ఐపీఎల్ రాకతో గ్రామీణ ప్రాంతాలకు కూడా క్రికెట్ చేరువైంది. 20 సంవత్సరాల క్రితంతో పోలిస్తే ఇప్పుడు భారతీయ క్రికెట్‌లో వందలాదిగా క్రీడాకారులు మేమున్నామంటూ ముందుకు వస్తున్నారు. బ్యాట్‌తో పరుగుల వరద పారిస్తూ.. బాల్‌ను తిప్పేస్తూ రోజుకో ఆటగాడు తెర మీదకొస్తున్నాడు. పురుషులే కాదు మహిళలు కూడా తాము ఎందులోనూ తీసిపోమని సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ఆర్డీటీ అండదండలు అందిస్తోంది. మరికొంత మంది స్వతహాగా క్రికెట్‌లో మెలకువలు నేర్చుకుని రాణిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనంతపురం క్రికెట్ క్రీడాకారులు మెరుస్తున్నారు.

ఆంధ్రా కెప్టెన్‌గా గిరినాథరెడ్డి



రంజీ ట్రోఫీలో గిరినాథరెడ్డి ప్రాతినిధ్యం వహించారు. అండర్-25 విభాగంలో ఆంధ్రప్రదేశ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఏపీఎల్‌లో రాయలసీమ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. గతేడాది వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. గిరినాథరెడ్డి కుడిచేతి బ్యాట్స్‌మెన్, మీడియం పేస్ బౌలింగ్‌లో రాణిస్తున్నాడు. అండర్-23లో మధ్యప్రదేశ్ జట్టుపై 25 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీసిన రికార్డు ఉంది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన గిరినాథరెడ్డి మంచి కెప్టెన్‌గా గుర్తింపు దక్కించుకున్నాడు.

దత్తారెడ్డి ప్రతిభ



ఆంధ్ర తరఫున అండర్-19 విభాగంలో హర్యానాపై మచ్చా దత్తారెడ్డి 172 పరుగులు సాధించి రికార్డు సృష్టించాడు. మణిపూర్‌పై 105 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. వికెట్ కీపర్‌గాను, బ్యాట్స్‌మెన్‌గాను అద్వితీయ ప్రతిభ కనబరుస్తున్నాడు. అండర్-23లో గోవాపై 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రస్తుతం ఏపీఎల్‌లో బెజవాడ టైగర్స్ జట్టు తరఫున ఆడుతున్నాడు. కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా సత్తా చాటుతున్నాడు.

పరుగుల వరద.. అర్జున్ టెండూల్కర్



కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌గా అర్జున్ టెండూల్కర్ సత్తా చాటుతున్నాడు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో వైజాగ్ వారియర్స్ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. అండర్- 19 కేటగిరిలో జిల్లా తరఫున కడప జట్టు మీద ఆడి 308, తూర్పు గోదావరి జట్టు మీద 208, చిత్తూరు మీద 236 పరుగులు చేసి సరికొత్త రికార్డు నెలకొల్పాడు.

వికెట్ల వీరుడు మల్లికార్జున



రాప్తాడుకు చెందిన జి.మల్లికార్జున ఎడమ చేతి స్పిన్నర్. ఆంధ్ర తరఫున అండర్-16లో సిక్కింపై 8, గోవాపై 7 వికెట్లు, అండర్-19 కేటగిరిలో బెంగాల్‌పై 7 వికెట్లు తీశాడు. బీసీసీఐ అండర్ -16 టోర్నీలో 38 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన రెండో క్రీడాకారుడిగా నిలిచాడు. ఏపీఎల్‌లో వైజాగ్ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

ఆల్‌రౌండర్ షోయబ్ మహమ్మద్ ఖాన్



శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి చెందిన షోయబ్ మహమ్మద్ ఖాన్ కుడి చేతి స్పిన్నర్. రంజీ ట్రోఫీలో 28 మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉంది. ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడు. ఒకే మ్యాచ్‌లో 6 వికెట్లు తీసి ప్రతిభ చాటాడు. మిడిల్ ఆర్డర్‌లో కుడి చేతి బ్యాట్స్‌మెన్‌గానూ రాణిస్తున్నాడు.

ఏపీఎల్‌లో సెంచరీ సాధించిన డీబీ ప్రశాంత్



డీబీ ప్రశాంత్ కుమార్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో సెంచరీ సాధించిన ఆటగాడిగా గుర్తింపు దక్కించుకున్నాడు. రంజీ ట్రోఫీలో 65 మ్యాచ్‌లు ఆడిన అనుభవం. హిమాచల్ ప్రదేశ్‌పై ఆడిన మ్యాచ్‌లో 199 పరుగులు సాధించడం గమనార్హం. కుడిచేతి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అయిన డీబీ ప్రశాంత్ కుమార్ ఏపీఎల్‌లో రాయలసీమ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.

ఐపీఎల్‌కు అడుగు దూరంలో హనీష్



ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ జట్టు ట్రయల్స్ వరకు కోగటం హనీష్ వీరారెడ్డి వెళ్లాడు. ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మెన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. ఆంధ్రప్రీమియర్ లీగ్, అండర్-19 జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో గోదావరి టైటాన్స్‌పై ఏకంగా 92 పరుగులు సాధించాడు. ఆంధ్ర తరఫున అండర్-16లో రాజస్తాన్ జట్టుపై సత్తా చాటి గణనీయమైన స్కోరు చేశాడు.

బాలల హక్కుల చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి

పుట్టపర్తి అర్బన్: బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి సూచించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా హాస్టల వెల్ఫేర్ ఆఫీసర్లు, కేజీబీవీ స్పెషలాఫీసర్లకు శనివారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ దేశంలో 39 శాతం బాలలు ఉన్నారని, వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి మహేష్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, బాలలపై లైంగిక దాడుల నిరోధక చట్టం- 2012, బాలల న్యాయ చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం -2006 గురించి వివరించారు. ప్రజలతో పాటు బాల బాలికల్లో చైతన్యం తీసుకురావడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హాస్టల్ వార్డెన్లు ముందుండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శివరంగ ప్రసాద్, నిర్మలాజ్యోతి, మోహన్‌రాం, ఎస్ఎస్ఏ గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ డ్రైవర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ధర్మవరం రూరల్: పశువర్ధక శాఖ అంబులెన్స్ (1962) సర్వీస్‌లో డ్రైవర్ (పైలెట్) పోస్టులు భర్తీ చేయనున్నట్లు జిల్లా మేనేజర్ అనిల్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. డ్రైవర్ పోస్టుకు పదవ తరగతి పాసై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి 36 సంవత్సరాలలోపు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. నెలకు 10,800 వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం ఉంటుందని తెలిపారు. పని వేళలు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 91549 70180 నంబరులో సంప్రదించాలన్నారు.

గొర్రెల మందపై చిరుత దాడి



గొర్రెకు పంచనామా నిర్వహిస్తున్న దృశ్యం

శెట్టూరు: చిన్నంపల్లిలో గొర్రెల మందపై చిరుత దాడిచేసింది. బాధితులు, ఫారెస్ట్ అధికారులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి గ్రామ చివరనున్న గొర్రెల మందపై చిరుత దాడిచేసింది. గొర్రెలు బెదిరి చెల్లాచెదురు కావడంతో గొర్రెలకాపరి లక్ష్మప్ప గట్టిగా కేకలు వేశాడు. దీంతో చిరుత అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటికే ఒక గొర్రె మృతి చెందడంతో ఫారెస్ట్ అధికారులు, పశువైద్యశాఖ అధికారులు శనివారం గొర్రెకు పంచనామా నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ ఎఫ్ఎస్ఓ జగనాథం, ఇన్‌చార్జ్ బీట్ ఆఫీసర్ వాణి పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకం

పామిడి: పాళ్యం గ్రామంలో శనివారం వేకువజామున డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనను వైఎస్సార్‌సీపీ పామిడి మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కె.నారాయణ రెడ్డి ఖండించారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ప్రజాతీర్పును ఎవరైనా శిరసా వహించాల్సిందేనని అన్నారు. అంతేకానీ శిలా శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం మంచి సంప్రదాయం కాదని అన్నారు.

జగన్ వీరాభిమాని మృతి



మృతి చెందిన ఎర్రిస్వామి



ఎర్రిస్వామి చేతిపై వైఎస్ జగన్ పేరు

గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేని జగన్ వీరాభిమాని ఒకరు మనోవేదనతో మృతి చెందాడు. జె.వెంకటాంపల్లికి చెందిన ఉప్పర ఎర్రిస్వామి (37)కి మాజీ సీఎం వైఎస్ జగన్ అంటే ఎంతో ఇష్టం. అభిమానంతో తన కుడి చేతిపై వైఎస్ జగన్ పేరును పచ్చబొట్టు వేయించుకున్నాడు. సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యంగా ఎన్డీయే కూటమి గెలిచి అధికారంలోకి వచ్చింది. రెండో దఫా జగన్ సీఎం అవుతారని ఆశతో ఉన్న ఎర్రిస్వామికి ఈ ఫలితాలు నిరాశపరిచాయి. క్షేత్రస్థాయిలో ప్రజాబలం మెండుగా ఉన్న వైఎస్సార్‌సీపీ ఓటమిపాలవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. ఈవీఎంలలోనే ఏదో తేడా జరిగిందని, జగన్ సీఎం కాకుండా కుట్రలు చేశారని వాదిస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి భోజనం చేసి పడుకున్న ఎర్రిస్వామి (37) శనివారం ఉదయం ఎంతసేపటికీ నిద్ర లేవలేదు. భార్య లక్ష్మమ్మ లేపడానికి ప్రయత్నించినా ఆయనలో చలనం లేకపోవడంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి పరిశీలించగా.. అప్పటికే ఎర్రిస్వామి మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు మృతదేహంపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎర్రిస్వామికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సానుభూతి తెలిపారు. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

పూర్వ విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్లు



జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌తో పూర్వ విద్యార్థులు

అనంతపురం: పూర్వ విద్యార్థులు కళాశాలకు బ్రాండ్ అంబాసిడర్ లాంటి వారని యూపీఎస్సీ మాజీ సభ్యులు డాక్టర్ వై. వెంకట్రామిరెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో 1994-98 బ్యాచ్‌లో బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం జరిగింది. ముఖ్య అతిథి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ కళాశాలకు పట్టుకొమ్మల్లాంటి వారు పూర్వ విద్యార్థులేనని పేర్కొన్నారు. ఇప్పుడు చదువుతున్న విద్యార్థులకు మీ అనుభవాలు, సలహాలు ఎప్పటికీ ఉండాలని కోరారు. పూర్వ విద్యార్థుల సంఘం కళాశాలకు బలం అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ మాట్లాడుతూ ఇక్కడ ఇంజినీరింగ్ చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. తద్వారా కళాశాలకు జాతీయ స్థాయిలో కీర్తి ప్రతిష్టలు వచ్చాయన్నారు. యూనివర్సిటీ పురోగతికి పూర్వ విద్యార్థుల సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాలలో చదివిన వారు గొప్ప పదవుల్లో ఉన్నారన్నారు. చాలా నిబద్ధత గల విద్యార్థులు ఉండడమే ఇందుకు కారణమన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను సత్కరించారు. అప్పటి ప్రొఫెసర్ అయిన డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం డైరెక్టర్ ప్రొఫెసర్ సుజాత, ప్రొఫెసర్ శోభాబిందు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, ప్రొఫెసర్ కృష్ణయ్య, ప్రొఫెసర్ హెచ్.సుదర్శన రావు, డాక్టర్ మమత, డాక్టర్ భారతి, అజిత, డాక్టర్ కళ్యాణి రాధ, పూర్వ విద్యార్థులు మల్లికారెడ్డి, మనీష్ పంపత్వార్ (డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్షియల్ ప్లానింగ్), సాయి కిరణ్ (సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ సస్టైనబులిటీ సొల్యూషన్స్), కిరణ్ నల్లగొండ (సీనియర్ ప్రిన్సిపాల్ ఆర్కిటెక్ట్) తదితరులు పాల్గొన్నారు.

'లర్న్ ఈజీ' యాప్ ఆవిష్కరణ



యాప్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ మీనాక్షి

గోరంట్ల: పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే విద్యార్థులకు ఉపయోగపడేలా ధీరజ్ అనే విద్యార్థి రూపొందించిన 'లర్న్ ఈజీ' ఎడ్యుకేషన్ యాప్‌ను డీఈఓ మీనాక్షి ఆవిష్కరించారు. గోరంట్లలోని బాలుర ఉన్నతపాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గంధం ధీరజ్‌కు ఆరేళ్ల వయసు నుంచే కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంచుకుంటూ వస్తున్నాడు. యూట్యూబ్‌లో ట్యుటోరియల్స్ చూసి సొంతంగా సాధన చేస్తూ పరిణతి సాధించాడు. ఈ క్రమంలో నాలుగు నెలల నుంచి రోజుకు దాదాపు ఐదు గంటలపాటు శ్రమించి తోటి విద్యార్థులతో పాటు పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే వారి కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో అత్యున్నత ప్రమాణాలతో సాంకేతిక అంశాలను జోడించి పది లక్షల అక్షరాలతో 15వేల లైన్లతో 'లర్న్ ఈజీ' ఎడ్యుకేషనల్ యాప్ రూపొందించాడు. మండల విద్యాశాఖ అధికారులు దీని గురించి డీఈఓకు వివరించడంతో ఆమె శనివారం గోరంట్లకు విచ్చేసి రూపకర్తను అభినందించి, యాప్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే చాలు. ఇంటర్‌నెట్ అవసరం లేకుండానే యాప్‌లో విద్యా సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంది. ధీరజ్ జన్మదినాన్ని కుటుంబ సభ్యులు డీఈఓ సమక్షంలో నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో డీఈఓ మీనాక్షి యాప్ రూపకర్త ధీరజ్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, గోపాల్, జాన్ రెడ్డప్ప, హెచ్ఎం గోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రష్యా దేశంలో జిల్లా చరిత్ర



పుస్తకాన్ని చూపుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: జిల్లా ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. రష్యాలో ఉన్న బ్రిక్స్ లైబ్రరీలో అనంతపురం చరిత్రకు సంబంధించిన ప్రత్యేక పుస్తకం అందుబాటులోకి వచ్చింది. 'అనంతపురం ద జెమ్ ఆఫ్ రాయలసీమ' పేరుతో ముద్రితమైన పుస్తకాన్ని రష్యాలోని కజాన్ నగర మేయర్ ఇలుసుర్ మెట్షిన్‌తో కలిసి మేయర్ వసీం ఆవిష్కరించారు. రష్యాలో బ్రిక్స్ దేశాల సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లిన మేయర్ వసీం శనివారం అక్కడ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో అనంతపురం నగర విశేషాలు, జిల్లాలోని ప్రముఖ చారిత్రక ప్రదేశాలకు సంబంధించిన వివరాలను పొందుపర్చారు. ఈ సందర్భంగా మేయర్ వసీం 'సాక్షి'తో మాట్లాడుతూ 'అనంత' ఘన చరిత్రను బ్రిక్స్ దేశాల మేయర్ల సదస్సులో తెలియజేసే అద్భుత అవకాశం తనకు దక్కడం సంతోషంగా ఉందన్నారు.

భక్తుల కొంగుబంగారం ఎర్రితాతస్వామి

- నేటి నుంచి 88వ ఆరాధనోత్సవాలు

బెళుగుప్ప: భక్తుల కొంగుబంగారంగా అవధూత సద్గురువు ఎర్రితాతస్వామి వెలుగొందుతున్నాడు. ఎనిమిదిన్నర దశాబ్దాల క్రితం ఆధ్యాత్మిక బోధనలు చేస్తూ కర్ణాటక నుంచి బెళుగుప్పకు చేరుకున్న ఎర్రితాతస్వామి ఎన్నో మహిమలు చూపారు. శాంతిధామం లోనే తన భక్తుల సమక్షంలో 1936లో జీవసమాధి పొందారు. ఎర్రితాతస్వామిని పూజిస్తే వంశవృద్ధి జరుగుతుందని, రోగాలు నయమవుతాయని, కష్టాలు దరిచేరవని భక్తుల విశ్వాసం. ఎర్రితాత 88వ ఆరాధనోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయి. సోమవారం పల్లకీసేవ, సాయంత్రం శేషతల్ప అలంకరణలు, మంగళవాయిద్యాలు, భజనల నడుమ రాత్రి 10 గంటల నుంచి పురవీధులగుండా వైభవోపేతంగా స్వామివారి ప్రభోత్సవ ఊరేగింపు నిర్వహిస్తారు. మంగళవారం అభిషేకాలు, అర్చనలు, మహామంగళ హారతి, ఛత్రప్రభ అలంకారం, ఉట్లపరుష, రాత్రికి భజనలు, కోలాట కార్యక్రమాలు నిర్వహించనున్నారు.